క్లుప్తంగా

వాలీబాల్ టోర్నీ విజేత గులివిందాడ


విజేతలతో టోర్నీ నిర్వాహకులు

కొత్తవలస: మండల కేంద్రంలో విశాఖపట్నం రోడ్డులో ఉన్న వసంత్ విహార్ కాలనీ వద్ద శుక్రవారం నిర్వహించిన మండల స్థాయి వాలీబాల్ పోటీల్లో గులివిందాడ జట్టు ప్రథమ స్థానంలో నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీల్లో మొత్తం 20 జట్లు పాల్గొనగా..ద్వితీయ స్థానంలో అద్దన్నపాలెం జట్టు, తృతీయ స్థానంలో గనిశెట్టిపాలెం జట్టు నిలిచాయి. విజేతలకు రూ.10వేలు, రూ.5వేలు, రూ.3వేలు చొప్పున ఫర్ ది పీపుల్ ట్రస్ట్ అధ్యక్షుడు వి.హరికుమార్, వసంత్ విహార్ చైర్మన్ వల్లూరి జయప్రకాష్‌బాబు, గోవింద, నూకరాజుల సహకారంతో అందజేశారు.

50 మందికి చీరలు పంపిణీ


చీరలను పంపిణీ చేస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి పట్టణంలోని రామేశ్వర కాలనీలో దాస్ మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 50 మంది పేదలకు శనివారం చీరలు పంపిణీ చేశారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సుధారాణి ట్రస్టు విజయనగరం వారి సహకారంతో చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు ట్రస్టు ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షుడు వాండ్రంకి వెంకటేష్, వైఎస్సార్‌సీపీ నాయకుడు పి.కుమార్, ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వీవీఎస్ఎస్ఎన్ గుప్త, ట్రస్టు ప్రతినిధులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు అండగా..


రైల్వేస్టేషన్ వద్ద నిరాశ్రయులకు దుప్పట్లు కప్పుతున్న గోవిందరాజులు

చీపురుపల్లి: పట్టణానికి చెందిన మానవీయత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు బీవీ గోవిందరాజులు మానవత్వాన్ని చాటుకున్నారు. రైల్వేస్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్, ప్రధాన రహదారులోని పలు కూడళ్ల వద్ద నిరాశ్రయులైన వృద్ధులకు శుక్రవారం రాత్రి దుప్పట్లు పంపిణీ చేశారు. సంస్థ తరఫున ఏటా నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ చేయడంతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు గోవిందరాజులు తెలిపారు.

ముగిసిన క్రికెట్ లీగ్


విజేత జట్టు సభ్యులతో జగన్నాథం, సీఐ సింహాద్రినాయుడు, తదితరులు

శృంగవరపుకోట: సంక్రాంతి సంబరాల్లో భాగంగా పట్టణంలో నిర్వహించిన క్రికెట్ ప్రీమియర్ లీగ్ శనివారంతో ముగిసింది. టోర్నీ విన్నర్‌గా ఎస్.ఎస్.వారియర్స్, రన్నర్స్‌గా రైల్వేస్టార్స్ జట్లు నిలిచాయి. ముగింపు కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రొంగలి జగన్నాథం, ఎస్.కోట సీ.ఐ సింహాద్రి నాయుడు తదితరులు పాల్గొని క్రీడాకరులను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం విన్నర్స్‌కు రూ.45 వేలు, రన్నర్స్‌కు రూ.30 వేలు నగదు బహుమతి అందజేశారు.

ప్రమాదాల నివారణకు చర్యలు


హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేసిన దృశ్యం

గజపతినగరం రూరల్: మండలంలోని పురిటిపెంట సామిల్లు మలుపు వద్ద వరుస ప్రమాదాలు జరుగుతుండడంతో పోలీసులు ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టారు. ఆర్అండ్‌బీ అధికారులతో కలిసి మలుపు వద్ద హెచ్చరిక బోర్డులతో పాటు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించేలా రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. దీనిపై వాహన చోదకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


పిచ్చిమొక్కలు తొలగించడంతో వెడల్పు అయిన రోడ్డు

భోగభాగ్యాల భోగి

మూడు రోజుల సంక్రాంతి పండగ భోగీతో ఘనంగా మొదలైంది. సూర్యభగవానుడు ధనస్సు రాశి నుంచి మకర రాశిలోకి ప్రవేశించడాన్నే మకర సంక్రాంతి అంటారు. ఈ పండగకు ఒక్కరోజు ముందు భోగి పండగ చేసుకుంటారు. పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా వాడవాడలా ప్రజలు భోగిని ఘనంగా జరుపుకున్నారు. శనివారం వేకువజామున భోగి మంటలు వేసి సందడి చేశారు. మహిళలు ఇళ్ల ముందు రంగవల్లులు వేసి సంక్రాంతికి స్వాగతం పలికారు. ధనుర్మాసం ముగింపు సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

– చీపురుపల్లి/గజపతినగరం/ఎస్.కోట నెట్‌వర్క్


గుర్ల: కెల్లలో భోగి మంట వద్ద సందడి చేస్తున్న గ్రామస్తులు


చీపురుపల్లి: కస్పావీధిలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ నివాసం వద్ద భోగి మంట


బొండపల్లి: భోగి మంట వేస్తున్న యువకులు


గజపతినగరం: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భోగి మంట కాగుతున్న చిన్నారులు


చీపురుపల్లి: దేవాంగులవీధిలో భోగి మంట వద్ద జెడ్పీటీసీ శిరీష, వైఎస్సార్‌సీపీ నాయకులు


జామి: మండల కేంద్రంలో భోగి మంటలు


గంట్యాడ: పెదవేమలిలో భోగి మంట వద్ద చిన్నారుల సందడి


దత్తిరాజేరు: కోమటిపల్లిలో భోగి మంట వద్ద పిల్లలు, పెద్దలు


శృంగవరపుకోట: ఎస్.కోటలో భోగి మంట వద్ద చలికాగుతున్న వృద్ధులు, పిల్లలు


కొత్తవలస: ఎల్.కోటలో గంగిరెద్దు బృందం సందడి

మార్కెట్‌కు భోగి కళ


పండగ సరుకులు కొనుగోలు చేస్తున్న జనాలు


నూతన వస్త్రాలు కొనుగోలు..


కొత్తవలస: కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న కొత్తవలస జంక్షన్

చీపురుపల్లి: పట్టణంలో శనివారం ఏర్పాటు చేసిన భోగి సంత కొనుగోలుదారులతో కిటకిటలాడింది. చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం మండలాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు మార్కెట్‌కు తరలి వచ్చి సంక్రాంతి పండగకు కావాల్సిన సరుకులు, పండ్లు, కూరగాయలు, పూజా సామగ్రి, నూతన వస్త్రాలు కొనుగోలు చేశారు. కొనుగోలుదారులతో ప్రధాన రహదారులు జనంతో నిండిపోయాయి.

కొత్తవలస: మండల కేంద్రంలోని మార్కెట్‌కు పండగ కళొచ్చింది. రెండేళ్లుగా కరోనా కారణంగా పండగ సమయంలో వెలవెలబోయిన మార్కెట్.. ఈ ఏడాది కొనుగోలుదారులతో కిటకిటలాడింది. పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున మార్కెట్‌కు వచ్చి పండగ సామగ్రి, కొత్త దుస్తులు కొనుగోలు చేస్తూ కనిపించారు.

ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు

శృంగవరపుకోట: సంక్రాంతి సంబరాల్లో భాగంగా పట్టణంలోని ఫ్రెండ్స్ రిక్రియేషన్ క్లబ్ ఆవరణంలో బ్యాడ్మింటన్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన బ్యాడ్మింటన్ పోటీలు శనివారం ముగిశాయి. సింగిల్స్‌లో సబ్‌జూనియర్స్ విభాగంలో షేక్ అబ్దుల్, వి.శ్రీనివాసరావు, జూనియర్స్‌లో మహ్మద్ నిషా ద్ఫాతిమా, పి.రమ్య, సీనియర్స్‌లో బి.హారిక, పి.మౌనిక వరుసగా ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. డబుల్స్ విభాగంలో ఎం.జాన్సన్, ఎం.చరణ్‌తేజ జోడి ప్రథమ స్థానంలో, పి.హరిచందన్, పి.మౌనిక జోడి ద్వితీయ స్థానంలో నిలిచాయి. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్‌సీ అధ్యక్షుడు డా.సత్యశేఖర్, ఎ.రమేష్, ఎ.మోహన్, పి.శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. గోదారంగనాథుల కల్యాణం


గజపతినగరం: గోదాదేవి, రంగనాథ స్వామి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు


జామి: అన్నంరాజుపేటలో గోదారంగనాథుల కల్యాణం


లక్కవరపుకోట: శ్రీరాంపురంలో గోదాదేవి, రంగనాథుల అలంకరణలో సీతారామచంద్ర స్వామివారు

జామి: మండలంలో అన్నంరాజుపేట వేణుగోపాల స్వామి ఆలయంలో, భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ ప్రాంగణంలో ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో గోదాదేవి, రంగనాథుల కల్యాణ మహోత్సవాన్ని శనివారం కనుల పండువగా నిర్వహించారు. ముందుగా అర్చకులు కల్యాణ మూర్తులను సుందరంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం వేదమంత్రోచ్చరణల మధ్య శాస్త్రోక్తంగా స్వామివారి కల్యాణం జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కల్యాణాన్ని తిలకించి తరించారు. అన్నంరాజుపేటలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

లక్కవరపుకోట: మండల కేంద్రంతో పాటు శ్రీరాంపురం గ్రామంలోని సీతారామచంద్ర స్వామి ఆలయంలో గోదారంగనాథుల కల్యాణోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు.

గజపతినగరం: వేంకటేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో గోదాదేవి, రంగనాథ స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. గ్రామ పెద్దలు, భక్తులు ఈ ఉత్సవంలో పాల్గొని స్వామివారి కల్యాణాన్ని తిలకించారు.

వైభవంగా స్నపన తిరుమంజనం


వేపాడ: స్నపన తిరుమంజనంలో పసుపు అలంకరణలో స్వామి దర్శనం

వేపాడ: మండల కేంద్రమైన వేపాడలో శ్రీదేవీ భూదేవీ సమేత కల్యాణవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్నపన తిరుమంజనాన్ని వైభవంగా నిర్వహించారు. ధనుర్మాసం ఆఖరిరోజు భోగి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు రంభ దేముడునాయుడు, అమ్మాజీ దంపతుల సహకారంతో ఆలయ ధర్మకర్త రాపర్తి చిరంజీవి ప్రసాద్ మంత్రోచ్చరణలతో స్వామివారికి పంచామృతాభిషేకం, సుగంధ ద్రవ్యాభిషేకం, పసుపు అలంకరణ, దీపహారతి, నక్షత్ర, కర్పూరహారతి, దాతలు సమకూర్చిన పట్టువస్త్రాలంకరణతో అష్టోత్తర శతనామ పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు


కుమరాంలో ముగ్గులను పరిశీలిస్తున్న గ్రామ పెద్దలు


బొండపల్లి: బి.రాజేరులో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్న ఎంపీపీ చలం నాయుడు, సర్పంచ్ కృష్ణ


దత్తిరాజేరు: ముగ్గులను పరిశీలిస్తున్న గ్రామ పెద్దలు

జామి/బొండపల్లి/దత్తిరాజేరు: మండలంలో కుమరాం గ్రామంలో భోగి పండగ సందర్భంగా శనివారం స్థానిక యువత ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సుమారు 50 మంది మహిళలు పాల్గొని రంగవల్లులు వేశారు. గ్రామ పెద్దలు పిన్నింటి రవికుమార్, కంది నర్సింగరావు, విశ్రాంత ఆర్మీ జవాన్ ఆర్.బైరాగి విజేతలకు బహుమతులు అందజేశారు. బొండపల్లి మండలం బి.రాజేరు గ్రామంలో సర్పంచ్ కృష్ణ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఎంపీపీ చలం నాయుడు పోటీలను పర్యవేక్షించారు. దత్తిరాజేరు మండలం ఎస్.చింతలవలసలో సర్పంచ్ కంది పద్మావతి, మాజీ ఎంపీపీ తిరుపతినాయుడు ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు.

నేడు రైతుబజార్‌కు సెలవు లేదు

శృంగవరపుకోట: పట్టణంలో మార్కెటింగ్‌శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న రైతుబజార్‌కు సంక్రాంతి పండుగ దృష్ట్యా ఆదివారం సెలవు రద్దు చేసినట్టు ఈఓ సంతోష్ తెలిపారు. రైతులు, వినియోగదారుల కోరిక మేరకు రైతుబజార్ యధాతథంగా తెరిచి విక్రయాలు సాగించనున్నట్లు ఆయన తెలిపారు.

సీపీఐ నేతల నిరసన

శృంగవరపుకోట: భోగి మంటల్లో జీఓ నెం.1 కాపీలను సీపీఐ నాయకులు దహనం చేసి తమ నిరసన తెలియజేశారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.కామేశ్వరరావు మాట్లాడుతూ.. అప్రజాస్వామిక జీఓ నెం.1 ప్రభుత్వం ఉపసంహరించుకునే వరకు సీపీఐ ఆందోళన చేస్తుందన్నారు. ఈ జీఓపై హైకోర్టు స్టే ఇచ్చినా ప్రభుత్వ తీరు మారకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన తీరు మార్చుకోవాలని హితవుపలికారు. పార్టీ నేతలు మద్ది కృష్ణ, కె.భీముడు, షేక్ స్వామి, ఎస్.అప్పలరాజు, అప్పారావు పాల్గొన్నారు.